సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్ధేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ధంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

హరీశ్ (ఫైల్) | సురేశ్ (ఫైల్) | హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడువాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామవాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోరుట్ల రూరల్, అక్టోబర్ 5 : సర్పరాజ్‌పల్లె గ్రామంలో చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, డిజిటల్ హెల్త్ కార్డుల సర్వే రికార్డులను పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో పారిశుధ్యం, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, సూపరింటెండెంట్ చక్రధర్‌రావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

● సిరిపూర్‌లో పాలకవర్గ సభ్యుల రిలే నిరాహార దీక్ష

నిరాహారదీక్షలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు

మల్లాపూర్, అక్టోబర్ 5: సిరిపూర్ సహకార సంఘం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సహకార సంఘం అధ్యక్షుడు బద్దం అంజిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సహకార సంఘం కార్యాలయం ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘానికి అటాచ్‌గా ఉన్న అమ్మక్కపేట గ్రామంలో ఉన్న 3.11 ఎకరాల భూమి, గతంలో అక్రమాలకు పాల్పడిన పాత సీఈఓకు చెందిన వేంపేట గ్రామంలోని 1.20 ఎకరాల భూమిని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వేలం వేసినట్లు చెప్పారు. వేలం జరిగిన ఏడాది గడుస్తున్నా కొనుగోలు చేసిన వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడం లేదన్నారు. గత సీఈఓ చేసిన అక్రమాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సహకార సంఘం సమస్యలను పరిష్కరించాని కోరారు. ఇక్కడ వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

కాటేజీల నిర్మాణం కోసం ఇంజినీరింగ్ బృందం సభ్యులతో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- టీటీడీ ఇంజినీరింగ్ బృందంతో పలు నిర్మాణాలకు స్థల పరిశీలన

మల్యాల, అక్టోబర్ 5: కొండగట్టు అంజన్న ఆలయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, భవిష్యత్‌లో ఆలయాన్ని ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కోసం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో టీటీడీ నుంచి ఇద్దరు ఇంజినీరింగ్ బృంద సభ్యులు శనివారం కొండగట్టుకు రాగా, వారితో కలిసి అధికారులతో సమీక్షించారు. స్థల పరిశీలన చేపట్టారు. దేవాదాయ శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలను, మ్యాపులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ డీఈఈ నాగరాజు, ఏఈఈ నాగరాజు, వేములవాడ డీఈఈ రాజేశ్, ఈవో రామకృష్ణారావు, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ స్థానాచార్యులు కఫీందర్, ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, ఉపప్రధాన అర్చకులు చిరంజీవస్వామి, నాయకులు రాంలింగారెడ్డి, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు సన్మానం

కొండగట్టులో టీటీడీ తరపున పలు ప్రత్యేక పనులు చేపట్టేందుకు వచ్చిన ఇంజినీర్లను ఆలయ ఈవో రామకృష్ణారావు నేతృత్వంలో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఇన్‌స్పెక్టర్లు ధర్మేంధర్, అశోక్ పాల్గొన్నారు.

పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోం

జగిత్యాల, అక్టోబర్ 5: రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది సుందరీకరణ పేరుతో వ్యాపార ప్రయోజనాలు, కమీషన్ల కోసం పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని, ప్రతిఘటించి తీరుతామని సీపీఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్ హెచ్చరించారు. శనివారం జగిత్యాలలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కన్వీనర్ గుగులోతు తిరుపతి నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మూసీనదిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు నాశనం చేయొద్దని సూచించారు. లక్షల విలువ చేసే ఇండ్లను కూల్చి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామనడం సహేతుకమేనా..? అని ప్రశ్నించారు. ఇక్కడ ఉపాధి అవకాశాలు లేకుండా చేసి ఎక్కడికో తరలిస్తామంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే తాము ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఇక్కడ సీపీఎం జిల్లా నాయకులు గర్వందుల రమేశ్, వెంకట చారి, కుంచం శంకర్, అంగోతు నరేష్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

కోరుట్ల, అక్టోబర్ 5: పట్టణంలోని సాయిరాంపురా కాలనీలో మున్సిపల్ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన ఆక్రమ కట్టడాన్ని శనివారం కోర్టు ఉత్తర్వులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూల్చివేశారు. టీజీ బీపాస్ ద్వారా ఆనుమతి పొందిన భవన యజమానులు మున్సిపల్ శాఖ ఇచ్చిన ప్లాన్ మేరకు నిర్మాణం చేపట్టాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అధికారులు తిరుపతి, కిషన్, ప్రవీణ్‌కుమార్, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

అంజన్న సన్నిధిలో న్యాయమూర్తి

ఆలయ ప్రాకార మండపంలో సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నారాయణ

మల్యాల, అక్టోబర్ 5: కొండగట్టు అంజన్నను శనివారం జగిత్యాల జిల్లా సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి నారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామకృష్ణారావు నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేయగా, ఆశీర్వచనం చేశారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఇన్‌స్పెక్టర్లు ధర్మేంధర్, అశోక్ పాల్గొన్నారు.

చెల్లెను వేధిస్తున్నాడని.. బావను చంపిన బావమరిది

● నిందితుడి అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ

గంగారాంను అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, పక్కన సీఐ, ఎస్ఐ

కథలాపూర్, అక్టోబర్ 5: చెల్లెను వేధిస్తున్నాడని బావను బావమరిది హత్య చేసిన ఘటన భూషణరావుపేటలో కలకలం రేపగా, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు హత్యకేసుకు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు విలేకరులతో వెల్లడించారు. కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన నేతుల మల్లేశానికి భూషణరావుపేటకు చెందిన లావణ్యను ఇచ్చి 22 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఒక కొడుకు, కూతురు. 2015లో మల్లేశం తన కొడుకును బావిలో పడేసి చంపేశాడు. ఏడేళ్ల జైలు శిక్ష అనుభవించి ఏడాది క్రితమే ఇంటికి వచ్చాడు. అయితే మల్లేశం కొన్ని నెలలుగా భార్య లావణ్య, కూతురును వేధిస్తూ చంపేస్తానని బెదిరిస్తున్నాడు. మల్లేశం తీరుతో లావణ్య అన్న భూషణరావుపేటకు చెందిన భూపతి గంగారాం విసిగిపోయారు. మల్లేశం బతికి ఉంటే తన చెల్లెను, కోడలును చంపుతాడని భావించిన గంగారాం, ఈ నెల 1న మల్లేశంకు ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్నాడు. మధ్యాహ్నం నుంచి ఇద్దరు కలిసి మద్యం తాగి రాత్రివేళ దుంపేట శివారులోని వరదకాలువ వద్దకు వెళ్లారు. మల్లేశం మద్యం మత్తులో ఉండడంతో తలపై రాయితో కొట్టి చంపేసి, మృతదేహాన్ని వరదకాలువలో పడేశాడు. అనంతరం మల్లేశం బైక్‌ను కాలువ పక్కన పెట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మల్లేశం అదృశ్యమైనట్లు అన్న రాజమల్లయ్య ఈ నెల 2న పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు వరదకాలువ వద్ద బైక్ ఉండడంతో కెనాల్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. 4న మేడిపల్లి మండలం విలయాతబాద్ శివారులో వరదకాలువలో మృతదేహం కనిపించింది. అయితే గంగారాం అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించామని, హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో శనివారం కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ఇంకా ఎవరైనా ఉన్నారా..? అని దృష్టి సారిస్తున్నామని చెప్పారు. కేసును త్వరగా చేదించిన కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్ ఎస్ ఐ నవీన్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

తాత్కాలిక మరమ్మతులకు రూ.30లక్షలు

రాయికల్, అక్టోబర్ 5: వరద ప్రభావిత ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.30 లక్షలు మంజూరైనట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రాయికల్ పట్టణ గూడెటి రెడ్డి సంఘంలో రాయికల్ పట్టణ, మండలానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 9.66 లక్షల విలువైన చెక్కులు, 25 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా మంజూరైన రూ.25 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేసి, మాట్లాడారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డుల ప్రక్రియ పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని, పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలుకు దోహదం చేస్తుందన్నారు. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎమ్మార్వో ఖయ్యూమ్, ఎంపీడీవో చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో పాము కలకలం

పాముతో స్నేక్‌సాచర్

మల్యాల, అక్టోబర్ 5: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పాము కలకలం సృష్టించింది. బాత్రూమ్‌లోకి చొరబడింది. గమనించిన కార్యాలయ ఉద్యోగులు స్నేక్ స్నాచర్‌కు సమాచారం ఇచ్చారు. అతను వచ్చి పామును పట్టుకుని చెట్ల పొదల లోకి వదిలివేయడంతో అందరూ ఊరిపి పీల్చుకున్నారు.

కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

● అదనపు కలెక్టర్ పీ రాంబాబు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 5: ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ పీ రాంబాబు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో మద్దతు ధర ఒక క్వింటాలుకు గ్రేడ్-ఏ రకానికి రూ.2,320, కామన్ రకానికి రూ.2,300గా ప్రభుత్వం నిర్ణయించిందని, అలాగే సన్నరకం ధాన్యానికి మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రకటించిందని తెలిపారు. సన్న రకం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జి వ్యవసాయ విస్తరణ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందకుసాగాలని సూచించారు. ఏయే..? గ్రామాల్లో సన్న రకం సాగు చేశారో.. అక్కడి కొనుగోలు కేంద్రాలలో ప్రత్యేక కాంటాలు ఏర్పాటు చేయాలని, కొనుగోలు చేసిన తర్వాత సంచిపై ప్రత్యేక నంబర్ వేయాలని సూచించారు. ఆటోమెటిక్ ప్యాడీ క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచాలని, టోకెన్ పద్ధతిని పాటించాలన్నారు. రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, ఏ రోజుకు ఆ రోజు ధాన్యం నాణ్యత పరీక్షించి రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాల్లో సరిపడా హమాలీలను ముందుగానే సమకూర్చుకోవాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాల మేరకు లేకపోతే సంబంధిత పౌరసరఫరా క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ధాన్యం మిల్లులకు తరలించి సకాలంలో రైతుల ఖాతాలలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరా, గ్రామీణ అభివృద్ధి, జిల్లా సహకార, వ్యవసాయ, సహాయ కమిషనర్, లేబర్ డ